# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-06-2002, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పూజ, జపం, ధ్యానం ఇవి హిందూమతంలో సాంప్రదాయకంగా వచ్చేవి. భగవంతుని పాదాలను ధ్యానం చేయటం, ఆయన నామాన్ని జపించటం, ఆయన రూపాన్ని పూజించటం వీటిఅన్నింటియొక్క ప్రయోజనం మనస్సుకు పవిత్రత చేకూర్చటం. పవిత్రమైన మనస్సు స్వాధీనంలోనికి వస్తుందిగాని పవిత్రంకాని మనస్సు మన స్వాధీనంలోనికి రాదు. మన వాక్కులో దోషం ఉండకూడదు, మన చేతలో దోషం ఉండకూడదు, మన ఆలోచనలో దోషం ఉండకూడదు. వాక్కు, చేత, తలంపులు దోషపూరితంగా ఉంటే ఆ జీవుడిని అశాంతి, దుఃఖం వెంటాడుతాయి. అశుభకర్మలు తగ్గించుకొంటూ శుభకర్మలు పెంచుకొంటూ రావాలి. అశుభవాసనలు తగ్గించుకొంటూ శుభవాసనలు పెంచుకొంటూ రావాలి. ఆత్మవిచారణ, ధ్యానం, సత్పురుషుల సహవాసం వీటిఅన్నింటివలన ముందు మనిషిలో ఉన్న మూర్ఖత్వం తగ్గుతుంది. కేవలం చదువు వలన, ధనం వలన మూర్ఖత్వం తగ్గదు. మూర్ఖత్వం ఎప్పుడైతే తగ్గిందో అప్పుడు మనం వివేకంగా జీవించటానికి అలవాటుపడతాము. వివేకాన్ని నెమ్మదిగా పెంచుకొంటూ రావాలి. తపస్సు అంటే కేవలం శరీరాన్ని, ఇంద్రియాలను ఎండింపచేయటం కాదు, అహంభావరహితంగా జీవించటం తపస్సు అన్నారు భగవాన్. భక్తియోగం, జ్ఞానయోగం, కర్మయోగం ఇలా అనేక యోగాలు భగవంతుడు చెప్పాడు. దేహము నేను అనే తలంపునుండి విడుదలపొందటమే అన్నియోగములయొక్క లక్ష్యం. మీరు ఏదైనా మంచిమాటలు చదివినప్పుడు, మంచిమాటలు విన్నప్పుడు ఆ మాటలను మననం చేయాలి. ఆ మాటలను మననం చేయగా చేయగా మనస్సు అంతర్ముఖమవుతుంది. మనస్సు అంతర్ముఖమవ్వటం ప్రారంభించినప్పుడే మీకు సుఖం, శాంతి తెలుస్తుంది. మన మనస్సు సహజంగా లోకాన్ని, విషయాలను చింతిస్తుంది. ఆ విషయచింతనలోనుండి ఆత్మచింతనలోనికి, దైవచింతనలోనికి దానిని మళ్ళించటమే పూజ, జపం, ధ్యానం యొక్క ప్రయోజనం. విషయచింతన వలన మనస్సు బాహ్యముఖానికి వెళుతుంది. ఎప్పుడైతే బాహ్యముఖానికి వెళ్ళిందో అది దుఃఖపడుతుంది, నష్టపడుతుంది, కష్టపడుతుంది, దేహం మరణించిన తరువాత పాడులోకాలకు ప్రయాణం చేస్తుంది. చాలా జాగ్రత్తగా ఆలోచించుకోండి. మనస్సులోపలకు వెళితే సుఖం, శాంతి, ఆనందం, మోక్షం. మనస్సు బాహ్యానికి వెళితే దుఃఖం, వేదన, రోదన అంతేకాదు మనస్సు బయటకు వెళితే బంధం. మన దగ్గర ఎంత డబ్బు ఉంది అని చూసుకోవటంకాదు, సాధకుడు చూచుకోవలసింది ఏమిటి అంటే మనస్సు బయటకు వెళుతోందా, లోపలకు వెళుతోందా అని సాధనలో చూసుకోవాలి. రజోగుణం, తమోగుణం వేగం ఉన్నప్పుడు మనస్సు బాహ్యముఖానికి వెళుతుంది, సత్వగుణం ఉన్నప్పుడు మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. ప్రయత్నం చేసినా సత్వగుణం లేకుండా జ్ఞాన సముపార్జన సాధ్యం కాదు. సత్వగుణాన్ని సముపార్జించుకోవాలంటే సహనాన్ని, ఓర్పుని ప్రాక్టీసు చేయాలి.

దేహం ఎంత నిజమో, ఆ దేహానికి వచ్చే రోగాలు, దేహంతో అనుభవించే భోగాలు కూడా అంతే నిజం. ఇది అంతా స్వప్న సమానము. నీ దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి నువ్వు లోచూపు నేర్చుకో. ఏ సంఘటన జరిగినా దానితో తాదాప్యం చెందవద్దు. అలా తాదాప్యం చెందకుండా ఉంటే నీ మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. మనం చేస్తున్న సాధన మీద ముందు మనకు నమ్మకం ఉండాలి, విశ్వాసం ఉండాలి. మన మీద మనకు విశ్వాసం ఉంటేనే ఏదైనా సాధించగలము. విశ్వాసం చాలా ముఖ్యం. ఆత్మాన్వేషణ చేయాలనే కోరిక దైవకృప వలననే కలుగుతుంది. గాఢనిద్రలో అహంభావన లేదు కాని అక్కడ మనం ఉన్నాము అక్కడ ఉన్నస్థితికి, అహంభావనకు ఎట్టి సంబంధంలేదు. గాఢనిద్రలో ఏస్థితి అయితే ఉందో, ఏ ఆత్మ అయితే ఉందో అది జాగ్రదవస్థలో కూడా ఉంది. జాగ్రదవస్థలో నీవు ప్రయత్నం చేసి దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అప్పుడు శాంతి, ఆనందం నీకు స్వరూపంగా వ్యక్తమవుతాయి. నీకు ఏ రూపంలో శాంతి వచ్చినా, సుఖం వచ్చినా అది ఆత్మలోనుండే వస్తుంది గాని బాహ్యపదార్థాలనుంచికాని, వస్తువులనుంచికాని సుఖం రావటంలేదు. బాహ్య పదార్థాల నుండి సుఖం వస్తున్నట్లు నీకు అనిపిస్తుంది కాని అది నిజంకాదు. చైతన్యానికి చావులేదు, పుట్టుకలేదు. అది మనమై ఉన్నాము. దేహభావనలో నుండి, రూపభావనలో నుండి, నామభావనలో నుండి ఎప్పుడైతే విడుదలపొందామో నది వెళ్ళి సముద్రంలో ఐక్యమైనట్లు నీవు చైతన్య స్రవంతిలో ఐక్యమవుతావు, ఆనంద ప్రవాహములో ఊగిసలాడతావు. చైతన్యం ఎప్పుడైతే అనుభవంలోనికి వచ్చిందో వాడికి దేహం జీవించటానికి, మరణించటానికి ఉన్న భేదం జారిపోతుంది. ఇప్పుడు మనం జీవించి ఉన్నాము అనుకొంటున్నాము. మరణించిన తరువాత ఎక్కడికో వెళ్ళిపోతాము అనుకొంటున్నాము. మరణం అంటే మనకు భయం వేస్తోంది

ఎందుకంటే మరణం తరువాత మనం ఉండము అనుకొంటున్నాము. అసలు మరణానికి, జీవించటానికి బేధం లేదు. బేధం లేదు అన్నవిషయం ఎప్పుడు అనుభవంలోనికి వస్తుంది అంటే నీ హృదయంలో ఉన్న చైతన్యం తానుగా నీకు వ్యక్తమయినప్పుడు జీవితానికి, మరణానికి ఇసుమంతయు బేధం లేదన్న సంగతి నీకు అనుభవంలోనికి వస్తుంది. మనలను మనం పొగడుకోవటం, ఇతరులను నిందించటం ఇవి మనకు ఉన్న పెద్ద రోగాలు. ఈ రెండూ తగ్గించుకొంటే చైతన్యం అనుభవంలోనికి వస్తుంది. మిమ్మల్ని మీరు స్తోత్రం చేసుకొంటున్నారు అనుకోండి దేహము నేను అనే తలంపు పెరిగిపోతుంది, ఇతరులను విమర్శిస్తున్నారు అనుకోండి అప్పడు కూడా దేహమునేను అనే తలంపు పెరిగిపోతుంది. వీటివలన మనం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చామో మర్చిపోతున్నాము. ఒక మనిషి ఎంత చెడ్డవాడైనా వాడిని ద్వేషించవద్దు అని భగవాన్ చెప్పారు. ఎందుచేతనంటే వాడిని ద్వేషిస్తూ ఉంటే మీ మనస్సు బాహ్యముఖానికి వెళ్లిపోతుంది, మీరు నష్టపోతారు. మనం ఈశ్వరుడితో అనుబంధం పెంచుకోవాలి. ఈశ్వరచింతన వలన విషయచింతనలోనుండి విడుదల పొందుతాము. విషయచింతనలోనుండి ఎప్పుడైతే విడుదల పొందామో మీ మనస్సు వెళ్లి గూటిలో పడిపోతుంది. ఇది ధనంవలన, చదువు వలన వచ్చేదికాదు, బాహ్యమైన ప్రక్రియలవలన వచ్చేది కాదు. మన దైనందిన జీవితంలో వ్యక్తిభావన లేకుండా జీవించాలి. మన మాటలోగాని, చేతలోగాని వ్యక్తిభావన పెంచుకోకూడదు. బాహ్యంగా చేసే పనుల వలన నీకు పుణ్యం రావచ్చుగాని జ్ఞానం రాదు. జ్ఞానంవస్తే గాని శాంతిలేదు, సుఖంలేదు. మనం చేసేపని కర్తృత్వం లేకుండా చేయాలి. మీకు వ్యక్తిభావన ఉంటే మీరు అజ్ఞానంలో ఉన్నట్లే. ఏదో ఒక రూపంతోగాని, నామంతోగాని తాదాప్యం పొందుతూ ఉంటే మీరు అజ్ఞానంలో ఉన్నట్లు గుర్తు. దైనందిన జీవితంలో నీ ప్రవర్తన ఎలా ఉండాలి అంటే దేహబుద్ధి నశించేలా ఉండాలి. దేహబుద్ధి నశించినప్పడు నీకు శివబుద్ధి కలుగుతుంది. గురువు చెప్పిన మాటలను మననం చేస్తే, ఆ రకంగా జీవిస్తూ ఉంటే మనస్సు నశిస్తుంది. ఈశ్వరానుగ్రహం లేకుండా ఈశ్వరుని చింతించలేవు. మనం ఈశ్వరానుగ్రహం సంపాదించాలి. ధనం సంపాదిస్తే బజారులో ఉన్న వస్తువును కొనటం ఎంత తేలికో ఈశ్వరానుగ్రహం సంపాదిస్తే ఈశ్వరుని పొందటం కూడా అంతే తేలిక. ఈశ్వరానుగ్రహం సంపాదించిన తరువాత అనుగ్రహం మిమ్మల్ని ఆపరేట్ చేస్తుంది. ఎలా ఆపరేట్ అవుతోందో మీకు స్పష్టంగా గోచరిస్తూ ఉంటుంది. మనలను నడిపించేవాడు, మనలను అనుగ్రహించేవాడు, మనకు మోక్షం ఇచ్చేవాడు మన హృదయంలోనే ఉన్నాడు.

**20-07-2002**

కాని మనకు బయట ఉన్న దేవుళ్ళు అంటే ఇష్టం, నిజమైన దేవుడు అంటే మనకు ఇష్టంలేదు. నిజమైన దేవుడు మన హృదయంలోనే ఉన్నాడు. మనస్సు కల్పించిన దేవుళ్ళు అంటే మనస్సుకి ఇష్టంకాని నిజమైన దేవుడి దగ్గరకు అది వెళ్ళదు, అక్కడకు వెళితే అది ఉండదు అన్న సంగతి దానికి తెలుసు కాబట్టి దాని నాశనాన్ని అది కోరుకోదు. మనలోపల ఉన్న ఈశ్వరుడు ఎలా పని చేస్తున్నాడో అలా మనం పనిచేయటం నేర్చుకొంటే ఆయన అనుగ్రహం మన శిరస్సు మీద వర్షిస్తుంది. ఈశ్వరుడు రాగ ద్వేషరహితుడుగా ఉంటాడు, సమబుద్ధి కలిగి ఉంటాడు. మనం రాగద్వేషాలను విడిచిపెడితే వెంటనే మనస్సు వెళ్లి గూటిలో పడిపోతుంది. మనస్సు దాని మూలాన్ని చూడకుండా అది నశించదు. నీవు ఏదో మార్గం ద్వారా ప్రయాణించి వైరాగ్యాన్ని పెంచుకొని మనస్సును దాని మూలంలోనికి పంపటానికి ప్రయత్నం చెయ్యి. మనో మూలంలోనే భగవంతుడు ఉన్నాడు. లోకం నిజం అనుకొన్నంత కాలం మనస్సు ఏదో రకంగా బయటకు వచ్చేస్తుంది. ఈ మనస్సు అనే బుజ్జిగాడిని మచ్చికచేసుకొని, దానితో విరోధం పెట్టుకోకుండా, దానిని నెమ్మదిగా విషయచింతనలోనుండి విడుదలచేసి హృదయంలో ఉన్న ఈశ్వరుడి చేతికి అందిస్తే ఆయన దానిని లోపలకు గుంజుకొంటాడు. లోపల ఉన్న ఈశ్వరుడి చేతికి అందివ్వటమే మీరు చేసేపని. లోపల ఉన్న గురువు నీ మనస్సును లోపలకు గుంజుకొని ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. అదే మోక్షం, అదే శాంతి, అదే ఆనందం. అప్పడు పరిమితులు లేని ఆనందంలో, స్వతంత్రమైన ఆనందంలో నీవు ఊగిసలాడతావు. అప్పడు నీకు లోకం కనిపించినా, కనిపించకపోయినా ఈ దేహం ఉన్నా, లేకపోయినా ఒక్కటే. అప్పడు వీటి అన్నింటికి నీవు అతీతంగా ఉంటావు. మన మనస్సులో దోషం ఉంటే గురువు చెప్పిన దానిని మన మనస్సు రిజెక్టు చేస్తుంది. ఆధ్యాత్మిక సాధన అంటే ఇతరులతో చేసే యుద్ధంకాదు, నీ మనస్సుతో నీవు చేసే యుద్ధం. ఒక వెయ్యి మందిని కత్తి పుచ్చుకొని చంపవచ్చు. ఇది తేలిక కాని మనస్సును నిగ్రహించుకోవటం చాలా కష్టం. మనోనిగ్రహం కష్టం, వివేకాన్ని కాపాడుకోవటం కష్టం అందుకు బహుజాగ్రత్తగా జీవించాలి. అజాగ్రత్త, అవినయం పనికిరాదు. దేశభక్తి వలన హృదయం విశాలమవుతుంది. హృదయం విశాలమయ్యే కొలది దేహం నేను అనే తలంపు దానంతట అదే అదృశ్యమవుతుంది. మనం సబ్జక్టును నేచురల్‌గా అవగాహన చేసుకొంటూ ఉంటే, ఆరకంగా జీవిస్తూ ఉంటే దేహము నేను అనే తలంపుకు నేచురల్‌గా డెత్ వచ్చేస్తుంది. అవగాహన కూడా యోగంతో సమానము. నీకు ఈశ్వరానుగ్రహం లేకపోతే,

**రమణ భాస్కర**

ఆయన దయ లేకపోతే జ్ఞానం సంపాదించాలి, సత్పురుషులతో సహవాసం చెయ్యాలి, మనకు తెలిసిన మంచిని ఇతరులకు బోధించాలి అనే బుద్ధి నీకు కలుగనే కలుగదు. నువ్వు సక్సెస్ అవ్వాలంటే స్వప్రయత్నం, కాల పరిపక్వం, ఈశ్వర కటాక్షం ఇవి మూడు అవసరం. నీ ప్రయత్నం నీవు చేయాలి, కాలం కలసి రావాలి, ఈశ్వరుడు అనుగ్రహించాలి. ఈ మూడు కలిసివస్తేనే ఆధ్యాత్మికంగా, భౌతికంగా కూడ ఆ పని సక్సెస్ అవుతుంది.

నీ తెలివి, నీ సాధన సరిపోదు. నువ్వు ఎవరినైతే పొందుదామని అనుకొంటున్నావో ఆయన అనుగ్రహం లేకుండా ఆయనను పొందలేవు. ఆయన అనుగ్రహం ఎలా వస్తుంది అంటే దైనందిన జీవితంలో మన ప్రవర్తనను బట్టి వస్తుంది. ఆధ్యాత్మిక జీవితం అంటే నన్ను నేను చంపుకోవటం అంటే దేహగతమైన నేనును చంపుకోవటం, ఇతరులను చంపటంకాదు. శరణాగతి వలన దేహగతమైననేను నశిస్తుంది. నీవు ఏదైనా మంచిచేస్తే, నీకు మంచి తలంపులు వస్తే ఇది అంతా ధనం క్రింద మారిపోయి ఈశ్వరుడి బాంక్‌లో ఉంటుంది. ఇక్కడ బాంక్‌లో మనం దాచుకొన్న డబ్బు మరణానంతర జీవితంలో చెల్లుబాటుకాదు. ఈశ్వరుడి బాంక్‌లో ఉన్న డబ్బు మరణానంతర జీవితంలో నీకు ఉపయోగపడుతుంది. అందువలన ప్రతీవాడు ఈశ్వరుడి బాంక్‌లో కొంత సొమ్ము వేసుకోవాలి. ఈశ్వరానుగ్రహం ఒకప్పుడు ఉండి, ఒకప్పుడు లేదు అనుకొంటున్నారేమో అనుగ్రహం ఎప్పుడూ ఉంది. ఆ ఉన్నది మీ చేతికి అందుకోవటానికే మీరు చేసే ప్రయత్నం. అనేక జన్మల నుండి నీవు ఆరాధించగా, ఆరాధించగా భగవంతుడే గురురూపంలో వస్తాడు. ఆయన నీ పట్ల దయచూపించి నీ మనస్సుకు లోచూపు కలుగజేస్తాడు, నీకు సత్వగుణాన్ని పెంచుతాడు, దేహాభిమానంలోనుండి నిన్ను విడుదల చేస్తాడు. ఇదంతా గురువు చేసేపని. మీకు సత్యానుభవం కలిగితేనేగాని మీరు బంధంలోనుండి, అజ్ఞానంలోనుండి విడుదల పొందలేరు. అజ్ఞానంలో నుండి విడుదల చేయలేని తల్లి తల్లికాదు, అజ్ఞానంలోనుండి విడుదల చేయలేని తండ్రి తండ్రికాదు, అజ్ఞానంలో నుండి విడుదల చేయలని గురువు గురువుకాదు. నీ మనస్సును అంతర్ముఖం చేయకుండా, దానిని బాహ్యాముఖం చేసేవాడు గురువుకాదు వాడు రాక్షసుడు అని చెప్పారు. ప్రాపంచిక విషయాలలో అతిగా ఉండవద్దు. దేవుడికి దగ్గరగా ఉండండి, విషయాలకు దూరంగా ఉండండి. మీ దేహయాత్రకు సరిపడ లోకంతో సంబంధం పెట్టుకోండి. లోకాన్ని ఉద్ధరిస్తాము అనుకోవద్దు. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోండి అప్పుడు మీ ద్వారా లోకం ఎంతోకొంత ఉద్ధరింపబడుతుంది. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోవటం మానివేసి లోకాన్ని ఉద్ధరిస్తాననటం అది ఆత్మవంచన. మనం

**20-07-2002**

పుస్తకాలు చదివిన దానికంటే మన మనస్సును బాగా చదువుకొంటే ఎక్కువ పాఠాలు నేర్చుకోగలం. మనస్సును చదవటం నేర్చుకొంటే మనలో ఏమి దోషాలు ఉన్నాయి, వేటిని మనం తొలగించుకోవాలి అనే అవగాహనకు మనం రాగలుగుతాము. లోకంతో అతిగా సంబంధం పెట్టుకొంటే మానసిక జ్వరం పెరుగుతుంది. శరీరానికి జ్వరం ఉంటే నోటిలో ఏది పెట్టుకొన్నా చేదుగా ఉంటుంది అలాగే మనస్సులో జ్వరం ఉంటే దేవుడు చెప్పినమాట చేదుగా ఉంటుంది, మంచివారు అందరూ చెడ్డవారుగా కనబడతారు. శారీరక జ్వరం స్మశానంలో కాలిపోతుందిగాని మానసికజ్వరం జన్మజన్మలకు మనలను వెంటాడుతుంది. నీకు మానసిక జ్వరం తగ్గాలంటే ఒకటే మందు సత్పురుషులతో సహవాసం చేయాలి. మనకు పుణ్యబలం లేకపోతే సత్పురుషులతో సహవాసం దొరకదు. సజ్జన సాంగత్యంలో సర్జరీ జరుగుతూ ఉంటుంది, సాధన చేస్తున్నట్లు నీకు తెలియకుండా సాధన చేసేస్తావు, సత్పురుషుల సహవాసం అటువంటిది. అటువంటి వారితో సహవాసం విడిచిపెట్టవద్దు. వారు నిన్ను ఎంత దూరం తీసుకొనిపోతారు అంటే పునర్జన్మ హేతువులను ఊడగొట్టటమే కాదు, నీ శరీరం ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే నీలోపల ఉన్న సద్వస్తువుతో అనుబంధం కలుగజేసి ఆత్మసుఖాన్ని, ఆనందాన్ని అనుగ్రహిస్తారు. ఈ భూమి మీద ఉండగానే ముక్తి సుఖాన్ని, పరిమితులు లేని సుఖాన్ని కలుగజేస్తారు. నువ్వు ఏదైతే పొందాలి అనుకొంటున్నావో దానిని ఈ జన్మలోనే పొందవచ్చు. రేపు రేపు అనుకోవద్దు, రేపుకు రూపు లేదు. అది సోమరితనానికి గుర్తు. ఏ రోజు చేసే సాధన ఆరోజు చెయ్యి. ఈశ్వరుడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసంతో, సిన్సియర్‌గా సాధన చెయ్యి. దైనందిన జీవితంలో నీ మాటలోగాని, పనిలోగాని కపటంలేకుండా చూసుకో. ఈశ్వరానుగ్రహం సంపాదించటానికి అనుగుణంగా పనిచేసుకో. ఆయన అనుగ్రహం లేకుండా ఆయనను పొందలేము. మనకు అర్హత, యోగ్యత వస్తోంది అనుకోండి, మనస్సుకు పవిత్రత వస్తోంది అనుకోండి మోక్షంకావాలి అని మనం అడగనక్కరలేదు, ఆయన అంతట ఆయనే మోక్షాన్ని ప్రసాదిస్తాడు. మనకు అర్హత లేనప్పడు అడిగినా ఇవ్వడు. నువ్వు నదులలో స్నానం చేయవచ్చు, గుడికి వెళ్ళి విగ్రహాన్ని ఆరాధించవచ్చు. సజ్జన సాంగత్యం ముందు ఇవి అన్నీ సెకండరీ. నీ హృదయంలో ఒక నిజం ఉంది. ఆ నిజం ఉందనే సంగతి నీకు తెలియటంలేదు. నీ హృదయంలో నిజం ఉంది అనే స్ఫూర్తిని నీకు కలుగజేసి, అది నీకు అనుభవంలోనికి వచ్చే వరకు నిన్ను వెంటాడుతాడు వాడు గురువు. జ్ఞాని మౌనం అన్నింటికంటే శక్తి వంతమైనది.

**రమణ భాస్కర**

జ్ఞానియొక్క మౌనం నీకు మారుమనస్సును తీసుకొనివస్తుంది, నీ మనస్సుకు పవిత్రత చేకూరుస్తుంది. జ్ఞాని యొక్క మాట, చూపు, కదలిక, చేత అన్నీ అనుగ్రహమే, ఆయన శరీరం ధరించటమే అనుగ్రహం. మీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చెయ్యండి. శివ, కేశవ బేధం లేదు ఈ శరీరం ఉండగానే శరీర రహితస్థితిని, అహంభావరహితస్థితిని పొందండి. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను ఉపయోగించుకొని, ఈ దేహాన్ని, మనస్సును మేగ్జిమమ్ ఉపయోగించుకొని ఈ శరీరానికి మరణం రాకముందే మరణంలేని వస్తువును పొందండి.

**అమ్మలార వినరే! ఓ......**
**అయ్యలార కనరే!**
**అమ్మలార॥**

**తొలిజన్మంబుల చేసిన పుణ్యము**
**ఫలియించెను మన కనులముందరే!**
**అమ్మలార॥**

**పావనమగు జిన్నూరు క్షేత్రమున**
**పరమహంస నడయాడు చుండెనట!**
**అమ్మలార॥**

**వేద తరువునకు కాసిన పండట,**
**మోదమలర మన చేతి కందెనట!**
**అమ్మలార॥**

**మన హృదయమ్ముల గగన తలమ్మున**
**నెనరుతో తిరిగెడి జ్ఞాన చంద్రుడట!**
**అమ్మలార॥**

**అరుణాచలునకు ప్రియతనయుండట**
**కరుణతో కాచెడి గురుగుహుడేనట!**
**అమ్మలార॥**

**- R.A.** నాయక్





# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-07-2002, దిండి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సత్వగుణం ఉన్నవాడు భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను అభివృద్ధిలోనికి వస్తాడు. సత్వగుణం ఉన్నవాడికి ఉద్రేకం తక్కువగా ఉంటుంది, ఆలోచన ఎక్కువ ఉంటుంది. సత్వగుణం ఆలోచన యొక్క లోతులు పెంచుతుంది. సత్వగుణం ఉన్నవాడు తన బుద్ధిని బాగుచేసుకొంటాడు, బుద్ధిని శుద్ధిచేసుకొంటాడు. రజోగుణం, తమోగుణంలో ఉన్నవారు అల్లరి, ఆందోళన, డాంబికంగా మాట్లాడటం తప్ప పని సున్న. మన శరీరానికి మరణం వచ్చేలోపు బుద్ధిని శుద్ధి చేసుకోవాలి. ప్రపంచంలో ఏమీలేదు, ఏదో ఉందని మనకు అనిపిస్తుంది. అదేమాయ, అదే భ్రాంతి. మనకళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచంలో సారవంతమైనది ఏదీ లేదు, అంతా నిస్సారమే. ఉన్నదేదో అది మన హృదయలోనే ఉంది, అది మనమై ఉన్నాము. అది మనకు అనుభవంలోనికి వచ్చేవరకు జీవుడియొక్క యాత్రను ఎవరూ ఆపుచేయలేరు, వాడు ఎంతటివాడైనా ఈజననమరణములను ఎవరూ ఆపలేరు, ఈ ప్రకృతి గుణాలను దాటలేరు. లతామంగేష్కర్‌ను మీరు ఎందుకు పెళ్ళి చేసుకోలేదు అని అడిగితే అది దేవుని దయ అని చెప్పింది. నాకు పెళ్ళి అయిఉంటే అది దేవుని దయ, పెళ్ళి అవ్వకపోవటం కూడా దేవుని దయ. దేవుని దయ లేకుండా, ఆయనకు తెలియకుండా ఈ సృష్టిలో ఏదీ జరుగదు అని చెప్పింది. మీకు ఏమైనా కోరికలు ఉన్నాయా అని అడిగితే ఉన్నాయి అని చెప్పింది. ఏమిటి అని అడిగితే మరల నాకు శరీరం రాకూడదు, పునర్జన్మరాకూడదు ఈ కోరికమటుకు నాకు ఉంది, ఈ లోకంలో కోరుకోవలసినది ఏదీ నాకు కనబడటంలేదు అని చెప్పింది. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉంటే అది దేవుని దయ అనుకొంటాము. పరిస్థితులు మనకు ప్రతికూలంగా ఉంటే దేవునిదయలేదు అనుకొంటాము. ఇది భక్తుడి లక్షణంకాదు, తెలివిగలవాడి లక్షణం కాదు. మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అంతా దేవునిదయే. ఏది వచ్చినా జరుగుతున్నది, జరిగిపోయినది, జరుగబోయేది అంతా కూడా దేవునిదయే అని నిజంగా గుర్తించినవాడు మాత్రమే నిజమైన భక్తుడు, వాడు మాత్రమే నిజంగా దేవుని ప్రేమించేవాడు అని లతామంగేష్కర్ చెప్పింది.